క్లుప్తంగా

తీరంలో సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో జలకాలడుతున్న సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మ పాలెం తీర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడాయి. గాజువాక, స్టీల్‌ప్లాంట్, కూర్మన్నపాలెం, లంకెలపాలెం, అనకాపల్లి, పరవాడ, ఎన్టీపీసీ దీపాంజలినగర్ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సందర్శకులు తీరంలో ఆట పాటలతో సందడి చేశారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి ఆటలతో ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం ఇక్కడ వంతెన కింద సేదతీరారు. సాయంత్రం తీరంలో జలక్రీడలతో ఎంజాయ్ చేశారు.

మడకపాలెంలో నేడు గడప గడపకు..



కోన రామారావు

పరవాడ: మండలంలో కన్నూరు శివారు మడకపాలెం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొంటారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు.. శంకు స్థాపనలు ఉంటాయని తెలిపారు. రూ.76లక్షల వ్యయంతో నిర్మించనున్న మంత్రిపాలెం–మడకపాలెం బీటీ రోడ్డుకు శంకుస్థాపనతో పాటు మడకపాలెంలోనిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని మంత్రి అమర్‌నాథ్ ప్రారంభిస్తారన్నారు. అనంతరం మడకపాలెంలో నిర్వహించనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని రామారావు కోరారు.

భక్తులకు వైద్య సేవలు



మహిళకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, చిత్రంలోడీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. సింహాచలంలో కొండ మీద, కొండ కింద కూడా శిబిరాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేశారు. మహిళా భక్తురాలకు లోబీపీ రావడంతో ఆమెకు డాక్టర్లు ఎస్.పి. నాయక్,డాక్టర్ ఎస్.భాస్కర్ వైద్య సేవలు అందించారు.శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు.

'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ పెద వీర్రాజు

సీతంపేట: కథకులు తమ చుట్టూ ఉన్న సమాజం నుంచి కథా వస్తువును తీసుకున్నంత కాలం తెలుగు కథలోని తెలుగుదనానికి కీడు వాటిల్లదని కవి, వైద్య నిపుణుడు ఈదర పెద వీర్రాజు అన్నారు. ఎస్.కె.బాబు సంపాదకత్వంలో 56 మంది రచయితల 56 కథల సంకలనం కథా పరిమళాలు పుస్తకాన్ని ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన ఆవిష్కరించారు. విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అడపా రామకృష్ణ సభాధ్యక్షత వహించారు. విశ్రాంత తెలుగు విభాగాధిపతి మరడాన సుబ్బారావు, ఎస్.హనుమంతరావు పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో చీఫ్ ఇమ్మిగ్రేషన్ అధికారి డి.శ్రీహరి రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, సర్వేశ్వరశాస్త్రి, శిరేల సన్యాసిరావు, పరమేశ్వరరావు, చిన్ని రెడ్డి పాల్గొన్నారు.

చందనోత్సవంలో స్వచ్ఛంద సేవలు

- భక్తులకు వైద్య సదుపాయాలు



కార్యసిద్ధి హనుమాసేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ



సింహగిరి బస్టాండ్‌లో పులిహోర పంపిణీ చేస్తున్న సత్యసాయి ధ్యానమండలి సభ్యులు



సింహగిరి బస్టాండ్‌లో విజయలక్ష్మి ట్రేడర్స్ ఆధ్వర్యంలో..



పీఎఫ్ కార్యాలయం ఆధ్వర్యంలో ..



చాగంటి సత్సంగ్ ఆధ్వర్యంలో..



పానకం అందజేస్తున్న హరేకృష్ణ మూమెంట్ ప్రతినిధులు

సింహాచలం: చందనోత్సవం పురస్కరించుకుని ఆదివారం సింహగిరిపైన, కొండదిగువ పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు విశేషంగా సేవలందించాయి. సింహగిరిపై క్యూలతో పాటు పార్కింగ్ ప్రదేశంలో, సింహగిరి బస్టాండ్, కొండదిగువ పాతగోశాల జంక్షన్, పాత అడవివరం జంక్షన్‌తో పాటు సింహాచలం బస్టాండ్ వద్ద భక్తులకు ఈసేవలందించాయి. అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సింహగిరిపై మూడు మెడికల్ క్యాంపులు, కొండదిగువ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించారు. పలు ప్రైవేటు ఆస్పత్రులు కూడా భక్తులకువైద్య సేవలందించాయి. సొమ్మసిల్లిపడిపోయిన భక్తులకు అడవివరం ఆరోగ్యకేంద్రం వైద్యులు సిలైన్‌బాటిల్స్ ఎక్కించారు.

- సింహగిరిపై క్యూల్లో విశాఖకు చెందిన కార్యసిద్ధి హనుమాన్ సేవా సంఘం, శ్రీ విజయలక్ష్మి ట్రేడర్స్ సంయుక్తంగా భక్తులకు మజ్జిగ, పానకం, చాక్లెట్లు, బిస్కట్లు, నిమ్మతొనలు పంపిణీ చేశారు.
- విశాఖ పీఎఫ్ కార్యాలయ సిబ్బంది బిస్కట్లు, మజ్జిగ, లస్సీ అందజేశారు.
- సింహగిరి బస్టాండ్‌లో ప్రహ్లాదపురానికి చెందిన సత్యసాయు ధ్యానమండలి ఆధ్వర్యంలో పులిహోర పంపిణీ చేశారు.
- హరేకృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో పానకం, దద్దోజనం, కదంబం, చక్కెర పొంగళి పంపిణీ జరిగింది.
- తగరపువలసకు చెందిన మణికంఠ ఫుడ్‌కోర్టు ఆధ్వర్యంలో తీపి బూందీ,కర్జూరం, మజ్జిగ, డ్రింక్స్ పంపిణీ చేశారు.
- విజయనగరానికి చెందిన గాయత్రీ తపస్వి ఆధ్వర్యంలో ఓఆర్‌ఎస్ పంపిణీ చేశారు
- విశాఖకు చెందిన చాగంటి సత్సంగ్ ఆధ్వర్యంలో భక్తులకు దద్దోజనం, చక్కెరపొంగలి, కదంబం ప్రసాదం వితరణ చేశారు.
- నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండదిగువ భక్తులకు మజ్జిగ, మంచినీరు అందజేశారు.
- 98వవార్డు పరిధి పద్మావతినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, బిస్కెట్లు పంపిణీ చేశారు.

అడవివరంలో భక్తుల రద్దీ



మెట్లమార్గంలో సింహగిరికి వెళ్తున్న భక్తులు

సింహాచలం: చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరితో పాటు కొండదిగువ ఆదివారం భక్తుల రద్దీ నెలకుంది. స్వామివారి దర్శనానికి తెల్లవారుజామున ఒంటి గంట నుంచే భక్తులు తరలిరావడంతో అటు అడవివరం జంక్షన్ నుంచి ఇటు పాత గోశాల జంక్షన్ వరకు కిటకిటలాడింది. పాత అడవివరం జంక్షన్, గోశాల జంక్షన్ వద్ద భక్తులు తమ వాహనాలను పార్క్ చేసి అక్కడి నుంచి ఆర్టీసీ బస్సుల్లో సింహగిరికి చేరుకున్నారు. పాత అడవివరం జంక్షన్, పాత గోశాల జంక్షన్‌లలో తీవ్రంగా ట్రాఫిక్ స్తంభించింది. పలువురు భక్తులు పాతగోశాల నుంచి నడుచుకుంటూనే మెట్లమార్గంలో సింహగిరి చేరుకున్నారు. దీంతో మెట్లమార్గం ఇసుకేస్తే రాలనంతంగా రద్దీ మయమైంది. పాత గోశాల జంక్షన్ నుంచి అప్పన్నపాలెం వరకు రెండుకిలోమీటర్ల మేర బీఆర్‌టీఎస్ మధ్యరహదారి కార్ల పార్కింగ్‌తో నిండిపోయింది.

'బాలలకు సదుపాయాల లేమిపై నివేదిక ఇవ్వండి'

సింహాచలం: చందనోత్సవంలో బాలలకు అవసరమై సదుపాయాలు కల్పించడంలో విఫలకావడానికి కారణాలపై సమగ్ర నివేదిక కోరినట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారామ్ తెలిపారు. స్త్రీ,శిశు సంక్షేమశాఖ సిబ్బంది సేవలు, చైల్డ్‌లైన్ సేవలు వినియోగించుకోకపోవడాన్ని కమిషన్ తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. వారం రోజుల ముందే అధికారులతో సమావేశం నిర్వహించి సూచనలు చేసినా పట్టించుకోలేదని పేర్కొన్నారు. సంబంధిత అధికారులపై చర్యలకు రాష్ట్ర ప్రభుత్వానికి కమిషన్ తరపున సిఫార్సు చేయనున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



శ్రీరామమూర్తి

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎస్.ఈశ్వర్‌రావు, సబ్బవరపు శ్రీరామమూర్తి ఆరిలోవలో నివసిస్తున్నారు. వీరు కార్పెంటర్ పని చేస్తుంటారు. వీజుజీ ఆదివారం ఉదయం సింహపురి కాలనీలో పనిచేయడానికి స్కూటీపై ఊర్వశి జంక్షన్ నుంచి బిర్లా కూడలికి వస్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. పాత్రా ఇండియా కంపెనీ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి లారీ ఢీకొనడంతో డ్రైవ్ చేస్తున్న శ్రీరామమూర్తి తలకు, వెనుక కూర్చున్న ఈశ్వర్‌రావుకు చిన్న గాయాలవడంతో కేజీహెచ్‌కు తరలించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు



బోకం సూర్యనారాయణ తదితరులను కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి పాల సొసైటీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు బోకం సూర్యనారాయణ రాంపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.ఆయనకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. సూర్యనారాయణతో పాటు 3వ వార్డు మెంబర్ బోకం సింహాచలమ్మ, మాజీ వార్డు మెంబర్ బోకం జగదీశ్వరరావు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో సబ్బవరం వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ ,వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బయలపూడి భగవాన్ జయరాం, అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఉప సర్పంచ్ అప్పారావు,మాజీ సర్పంచ్ దేముడు బాబు,సచివాలయ కన్వీనర్ ఎర్రినాయుడు,సబ్బవరపు శ్రీను,గొంప రమణ,శ్రీరాంమూర్తి,బోకం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చందనస్వామిని దర్శించుకున్న అదీప్‌రాజ్

వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. చందనస్వామి నిజరూప దర్శనం అపురూపంగా ఉందని కొనియాడారు. – సింహాచలం



బహిరంగ సభకు తరలిరండి



సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఈ నెల 26న కూర్మన్నపాలెం జంక్షన్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. లోకనాథం పిలుపునిచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీపీఎం కార్యకర్తల విస్తృత సమావేశం సీపీఎం జిల్లా కార్యదర్శి బి. జగన్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న లోకనాథం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా పెట్టలేదని, కానీ ఆంధ్ర రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తానని పదేపదే ప్రకటనలు చేయడం సరి కాదన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని అడ్డుకోవాలంటే అఖిలపక్ష నాయకులను మోదీ దగ్గరకు తీసుకెళ్లే ఏర్పాటు చేయాలన్నారు. మరోవైపు స్టీల్‌ప్లాంట్‌పై బీజేపీ చేస్తున్న ప్రకటనలపై వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు మాట్లాడకపోవడం దారుణమన్నారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎం. జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎం. సుబ్బారావు, పైడిరాజు, యూఎస్‌ఎన్ రాజు, వి. నరేంద్రకుమార్, బి. వెంకట్రావు, ఎం. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మెరుగుపడని బతుకులు

రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి. ఎండనకా.. వాననకా పొద్దస్తమానం కష్టపడితే చేతికొచ్చేది కొద్ది మొత్తమే. దాంతోనే కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి. ఇత్తడికి మెరుగులద్దే వారి జీవితాలు మాత్రం మెరుగు పడటం లేదని కార్మికులు వాపోతున్నారు.. వీరికి ప్రభుత్వం నుంచి అందే సాయం అంతంత మాత్రమే. హామీ ఉంటే గానీ బ్యాంకులు రుణాలు ఇవ్వని పరిస్థితి. తమ బతుకులింతే అంటూ జీవనం కొనసాగిస్తున్నారు.

- ఆర్థిక ఇబ్బందుల్లో ఇత్తడి పాలిష్ కార్మికులు
- రెక్కాడితే గాని డొక్కాడని వైనం
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి



ఇత్తడి సామగ్రికి మెరుగు పెడుతున్న కార్మికుడు



అల్లిపురంలో దుకాణం నడుపుతున్న రవి

అల్లిపురం: నగరంలో ఇత్తడి మెరుగు పెట్టే కార్మికులు దుర్భరమైన జీవనాన్ని సాగిస్తున్నారు. అల్లిపురంలో మాత్రమే చిన్నచిన్న దుకాణాలు పెట్టుకుని చాలా మంది బతుకు బండి ఈడుస్తున్నారు. రోజంతా కష్టపడితే రూ.150 నుంచి రూ.200 గిట్టుబాటు కావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటితో ముడిసరుకులు కొనుక్కుని, రోజువారి ఫైనాన్స్‌లు కట్టుకుని, కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. పెరిగిన ధరలతో.. వచ్చే మొత్తంతో కుటుంబాలను నెట్టుకురావటం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలంలో ఇత్తడి వస్తువులకు గిరాకీ తక్కువగానే ఉంది. పాత వాటిని రిపేరు చేయించుకునే వారు మాత్రమే అడపా దడపా దుకాణాలకు వస్తుంటారు. చిన్నచిన్న రిపేర్లు వస్తే కాస్తంత డబ్బులు వస్తుంటాయని వారు తెలిపారు. బ్యాంకులు తగిన హామీ పెట్టకపోతే రుణాలు మంజూరు చేయడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఇత్తడి మెరుగు పెట్టే కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. తమలాంటి పేదలకు ఇళ్లు కేటాయించాలని కోరుతున్నారు.

హామీ లేని రుణాలు ఇప్పించాలి



ప్రభుత్వం ద్వారా వ్యాపారం చేసుకునేందుకు హామీ లేని రుణాలు ఇప్పించాలి. ఎటువంటి ఆధారం లేని మాకు హామీలు ఎవరిస్తారు. చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుంటే వాటికి అద్దె కట్టడం కష్టంగా ఉంది. ఇలాగైతే మాలాంటి వాళ్లు బతకడమెలాగో తెలియడం లేదు.

– గెద్దం భాస్కరరావు, ఇత్తడి మెరుగు కార్మికుడు, యాతపేట

పూట గడవక ఇబ్బంది పడుతున్నాం



రోజంతా కష్టపడినా పూట గడవడం కష్టంగా ఉంది. దీంతో అప్పులు చేసుకోవాల్సి వస్తోంది. వచ్చిన దాంట్లో అప్పులకు సగం, ఇంటి ఖర్చులకు మరో సగం పోతోంది. ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, ఇతర ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నాం. పనిలేక చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– రవి, ఇత్తడి మెరుగు పెట్టే కార్మికుడు, అల్లిపురం

సంక్షేమ సారథి జగన్



జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పార్టీ నేతలు



ధర్మారాయుడుపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న సచివాలయ కన్వీనర్లు

పరవాడ: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవడానికి ప్రజలంతా సిద్ధంగా ఉండాలని గొర్లివానిపాలెం వైఎస్సార్‌సీపీ నాయకుడు గొర్లి గోపి కోరారు. గొర్లివానిపాలెం శివారు జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో ఆదివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మండల జేసీఎస్ కన్వీనరు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

- రావాడ శివారు ధర్మారాయుడుపేటలో సచివాలయ కన్వీనర్ కావలి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని అడిగి తెలుసుకొన్నారు. సంక్షేమ పాలన కోసం మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని ప్రజలను కోరారు.


విష్ణు సహస్రనామ పారాయణతో విశ్వశాంతి




ఆకొండి సూర్యనారాయణశాస్త్రిని సత్కరిస్తున్న సభ్యులు

దాబాగార్డెన్స్: పాతనగరం ఉడ్‌యార్డ్ స్ట్రీట్‌లో గల శ్రీవాసవీ కల్యాణ మండపంలో ఆదివారం విష్ణు సహస్రనామ సంకీర్తన సత్సంగం 25వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఆకొండి సూర్యనారాయణశాస్త్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విష్ణు సహస్రనామ సంకీర్తన సత్సంగం (నేవల్ డాక్‌యార్డ్) సభ్యులచే విష్ణు పారాయణ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆధ్యాత్మిక సభలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. విష్ణు సహస్ర నామంతో విశ్వశాంతి కలుగుతుందని, సమస్త కర్మలు తొలగి దైవానుగ్రహం, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. గత 25 ఏళ్లుగా ప్రతి రోజూ నిర్విరామంగా విష్ణు సహస్రనామ పారాయణ చేస్తున్న సంకీర్తన సత్సంగ సభ్యులను అభినందించారు. అనంతరం సత్సంగం వ్యవస్థాపకుడు ఆకొండి సూర్యనారాయణ శాస్త్రిని సత్కరించారు. కార్యక్రమంలో పీఎస్‌వీ శ్రీనివాస్, ఎం. సతీష్, ఎం. వెంకట్రావు, రమేష్‌చంద్ర, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు



నడక పోటీల్లో పాల్గొన్న వాకర్స్



పోటీ పడుతున్న మహిళలు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వైశాఖీ స్పోర్ట్స్ పార్కులో వాకర్ ఆదినారాయణ స్మారక నడక పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వెంకట సుధాకర్ వీటిని ప్రారంభించారు. పోటీల్లో 102 మంది పాల్గొనగా.. వీరిలో 42 మంది మహిళలు ఉన్నారు. 31–40, 41–50, 51–60, 61–70, 71–80, 81–90 వయసుల వారీగా విభజించి మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా పోటీలు జరిపారు. ప్రతి విభాగం నుంచి మొదటి మూడు స్థానాలకు ఎంపిక చేశారు. విజేతలకు మే 1న నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందిస్తారు. ఈ పోటీల్లో వైశాఖీ స్పోర్ట్స్ పార్కు, త్రీస్టార్ వాకర్స్ క్లబ్, హెల్దీ వాకర్స్ క్లబ్, వనితా వాకర్స్ క్లబ్, మా వాకర్స్ క్లబ్, యూనివర్సల్ హెల్త్‌క్లబ్, ఇతర వాకర్స్ పాల్గొన్నారు. వీరికి ఉదయం ఫలహారాలు అందించారు.

సామాన్యులపై ధరల భారం తగదు



ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

సీతంపేట: ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న ప్రధాని నరేంద్రమోదీని గద్దె దింపి దేశాన్ని రక్షించాలని సీపీఐ నాయకుడు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల ప్రచార భేరి కార్యక్రమాన్ని ఆదివారం రామా టాకీస్ సమీపంలోని శ్రీనగర్, వినాయకనగర్ ప్రాంతాల్లో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వైపు సామాన్యులపై ధరల భారం మోపుతూ.. మరోవైపు బడా కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వరంగ సంస్థలను కట్టబెడుతున్నారని విమర్శించారు. నిత్యావసర సరకులు, ఇంధన ధరలను అదుపుచేసి ప్రజలకు ఆహార భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు రావి కృష్ణ, ఆటో సంఘం నాయకులు కె.గోవిందరాజు, సిహెచ్.యొహన, కనకరాజు, కె.రాము, పి.శ్రీను, జి.రమేష్ పాల్గొన్నారు.